క్లుప్తంగా

ముత్తరాజుకు ఎస్‌ఐగా పదోన్నతి

అభినందించిన ఎస్పీ నారాయణ రెడ్డి



ఎస్‌ఐ ముత్తరాజుకు డబుల్ స్టార్ అందజేస్తున్న ఎస్పీ నారాయణ రెడ్డి

దుద్యాల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముత్తరాజుకు ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. ఈ నెల 20న ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో అందుకు సంబంధించిన డబుల్ స్టార్‌ను వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి శనివారం ఎస్పీ కార్యాలయంలో అందించి అభినందించారు. పదోన్నతి పొందిన ముత్తరాజును దుద్యాల్ ఎస్‌ఐ యాదగిరి, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి విధులను నిర్వహిస్తానన్నారు.

యువవికాస దరఖాస్తుల పరిశీలన



యువవికాస దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

పూడూరు: ప్రభుత్వం అందించనున్న యువవికాస రుణాల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మండల పరిధిలోని 32 పంచాయతీలకు గాను 2,306 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించనున్నారు. లక్షలోపు రుణాలకు బ్యాంకు ఎలాంటి పూచికత్తు లేకుండా అందజేయనుంది. ఈ మేరకు అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. నిరుద్యోగులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం మంజూరు చేయనున్న యువ వికాసం రుణాలు ఎలాంటి షరతులు లేకుండా అర్హులకు ఇవ్వాలని కోరుతున్నారు.

చదువే అన్నింటికీ మూలం

బొంరాస్‌పేట: సకల సమస్యల పరిష్కారానికి, అధికారానికి చదువే మూలమని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ కాసీం అన్నారు. కొత్తూరులో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్, మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ విగ్రహాలను శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు.

లక్ష్యానికి మించి మొక్కలు నాటాలి

ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి



పిచ్చి గడ్డి తొలగిస్తున్న ఉపాధిహామీ కూలీలు

దోమ: గ్రామంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం బొంపల్లి ఆరోగ్య ఉప కేంద్ర ఆవరణలో పాడైపోయిన మొక్కల స్థానంలో నూతన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించేలా నిత్యం కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామంలో పార్మెషన్ రోడ్లు, పాంపాండ్, ల్యాండ్ లెవల్, వాలుకట్టలు, హర్టికల్చర్, పశువుల షెడ్లు, చిన్న ఫౌల్ట్రీషెడ్‌లు, అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు అనేక రకాల పనులను కూలీలకు కల్పిస్తున్నామన్నారు. పని ప్రదేశంలో ప్రతి కూలీకి సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న హరితహారానికి గ్రామంలోని రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటించి వాటిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు పని ప్రదేశంలో కూలీలు నిర్వహించిన పనులను పరిశీలించి కొలతల ప్రకారమే కూలి ఇస్తామన్నారు.

నిబంధనలు పాటించాలి

మొయినాబాద్‌రూరల్: ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రభాకర్ సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. వాహనాదారులు వాహనాలకు సంబంధించిన పేపర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్ తదితర చలాన్లను వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ అంజయ్య, కానిస్టేబుళ్లు యాదగిరి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- పల్లెదారుల విస్తరణ పనులు
- రూ.40కోట్ల వ్యయంతో ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



దౌల్తాబాద్ శివారులో కొనసాగుతున్న పనులు

దౌల్తాబాద్: పల్లెదారుల విస్తరణకు మోక్షం కలుగుతుంది. సింగిల్ రోడ్డును డబుల్‌గా మార్చేందుకు పనులు చకచక చేపడుతున్నారు. కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి గెలిచి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మండలంలో రోడ్లకు మహర్దశ పట్టాయి. ఇప్పటికే ఆయా తండాలకు, చిన్నచిన్న గ్రామాలకు పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అంతారం గ్రామం నుంచి బాలంపేట, తిమ్మారెడ్డిపల్లి, గోకఫసల్‌వాద్, దౌల్తాబాద్, ఈర్లపల్లి వరకు రూ.40కోట్ల వ్యయంతో 17.5 కిలోమీటర్ల మేర పనులు ప్రారంభించారు. గతంలో సింగిల్ రోడ్డు ఉండడంతో ఆయా గ్రామాల నుంచి దౌల్తాబాద్‌కు, ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడేవారు. పెద్ద వాహనాలు రాకపోకలు చేస్తున్న సమయంలో చిన్న వాహనాలు ఎదురుగా వస్తే పక్కకు నిలిపి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొనేది. ఈ నేపథ్యంలో ఆరు గ్రామాల ప్రజల ఈ దారి నుంచి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం పనులను అధికారులు త్వరగా చేయిస్తున్నారు.

ఆరు గ్రామాల పరిధిలో కల్వర్టులు..

ఆరు గ్రామాల పరిధిలో 15 కల్వర్టుల నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. గతంలో ఉన్న వాటిని బలోపేతం చేయడంతో పాటు అవసరమున్న చోట్ల కొత్తవి నిర్మించనున్నారు. వర్షాల సమయంలో నీరు నిల్వఉండకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో నీరు నిండి ఇబ్బందులు పడేవారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అవసరమైతే స్థానిక ప్రజలు, రైతుల అభిప్రాయాలు తీసుకుంటు ముందుకు సాగుతున్నారు. గతంలో సంభవించిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లను విస్తరిస్తున్నారు.

నాణ్యతతో చేపట్టాలి

అంతారం గ్రామం నుంచి ఈర్లపల్లిగ్రామం వరకు 17.5 కిలోమీటర్ల వరకు రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్‌ను నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించాము. పనులు వేగవంతంగా చేయాలని వివరించాము.

– నాగేందర్, ఏఈ ఆర్, దౌల్తాబాద్

అభివృద్ధి పనులకు చర్యలు

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

బంట్వారం: అభివృద్ధి పనులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశంతో కలిసి యాచారం, నూరుల్లాపూర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10.5 లక్షలతో పైప్‌లైన్, బోర్‌వెల్ పనులను ప్రారంభించి మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు వేయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శి వాసుమతి, నాయకులు రమేశ్, హరీశ్వర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆనందం వ్యక్తం చేస్తున్న తండావాసులు



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న సంత్రకుంట తండా నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని సంత్రకుంట తండాలో తాగునీటి సమస్య తీరనుందని తండా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంత్రకుంట తండాలో తాగునీటి సమస్య గురించి సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన అధికారులు తాగునీటి కష్టాలు లేకుండా చర్యలు చేపట్టారు. నీటి సరఫరా కోసం నెల రోజుల క్రితమే బోరు వేశారు. ప్రస్తుతం బోరు మోటర్, పంపు సెట్, బోరు నుంచి వాటర్ ట్యాంకు వరకు పైపులైన్ పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.5లక్షలను శనివారం మంజూరు చేసింది. దీంతో అందుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్, ఎస్టీ సెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు రాహుల్, శల్య నాయక్, మాణిక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



దోమ: పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచులు పద్మ, అనంతయ్య

బాస్పల్లి మాజీ సర్పంచులు పద్మ, అనంతయ్య

దోమ: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని బాస్‌పల్లి మాజీ సర్పంచులు పద్మ, అనంతయ్య పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బాస్పల్లి గ్రామంలో కీర్తిశేషులు చాకలి చిన్న స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్లు కె.నరేశ్, జి.కృష్ణ, కె.రాజు, ఎం.రాజు, శ్రీశైలం, జి.శేఖర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మ, అనంతయ్య ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చాకలి చిన్న పేరిట క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విజేతకు రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేల నగదు అందిస్తారని నిర్వాహకులు చెప్పారు. ప్రతి టీంకు నియమ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాల నేతలు, యువకులు, సీనియర్ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..



పూడూరు: మన్నెగూడలో టోర్నమెంట్ ప్రారంభిస్తున్న అనిల్‌రెడ్డి

పూడూరు: క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్నెగూడ గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలన్నారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచ్ బుచ్చన్న, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీస్‌ఖాన్, బీఆర్‌ఎస్ యువజన అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు వెంకటయ్య, లక్కం సత్యనారాయణ, జాహెద్, దయానంద్‌గౌడ్, యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

తాండూరు రూరల్: ఎల్‌ఎస్‌ఆర్ యువసేన, శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎల్‌ఎస్‌ఆర్ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దేముల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కావున గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

మొయినాబాద్: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించి వాటి ఆధారంగా పంటలు సాగుచేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు ఎ.మాధవి, పి.లీలారాణి అన్నారు. మండల పరిధిలోని చందానగర్‌లో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసార పరీక్షల ద్వారా నేల స్వభావాన్ని గుర్తించవచ్చన్నారు. అన్ని సీజన్‌లలో ఒకే రకమైన పంటను వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంభించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించేకోవాలని సూచించారు. నీటి వృథాను తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ విధానాలను పాటించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాలని కోరారు. మండల వ్యవసాయాధికారి అనురాధ, పీహెచ్‌డీ విద్యార్థులు సాయితరుణ్, నవ్య, ఏఈఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ తిరంగా ర్యాలీ



ధారూరు: నాగారం నుంచి ప్రారంభమైన ర్యాలీ

ధారూరు: మండలంలోని నాగారంలో తుల్జాభవానీ మాత ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బీజేపీ నాయకులు అక్కడి నుంచి తిరంగా యాత్ర ప్రారంభించారు. జమ్ముకాశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడి అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ నిర్వహించి ఉగ్రవాదులను మట్టుబెట్టిన సందర్భంగా సాయుధ దళాల గౌరవ సూచకంగా ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ ర్యాలీనాగారంలో పారంభమై మైలారం, తరిగోపుల, జైదుపల్లి, కేరెళ్లి, ధారూరు, అవుసుపల్లి, కుక్కింద, గడ్డమీది గంగారం గ్రామాల మీదుగా నాగసమందర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్, రాజునాయక్, సీనియర్ బీజేపీ నాయకులు పాండుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, ఎం. రమేశ్, మాజీ సర్పంచులు పరమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: సైన్య పోరాట పటిమను, ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని శనివారం పరిగి పట్టణంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బునేటి మారుతి కిరణ్ తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ నేతలతో కలిసి గాంధీ చౌక్ నుంచి కొడంగల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి కిరణ్ మాట్లాడుతూ..తిరంగా యాత్రను రాజకీయాలకు అతీతంగా నిర్వహించామన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రక్షణ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. పదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయన్నారు. గతంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల కోసం ఎదురైన ఇబ్బందుల నుంచి బయటపడి, భారత సైన్యానికి రఫెల్ ఫైటర్ జెట్లు, బ్రహ్మోస్ క్షిపణులు సమకూర్చారని చెప్పారు. రఫెల్ ఎయిర్ ఫైటర్, ఎస్400 మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలు సమయంలో కొందరు ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వాటి ప్రాధాన్యత, ఫలితాలు ప్రపంచానికే తెలిసొచ్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు

అభివృద్ధి చేయాలంటూ స్థానికుల ధర్నా

శంకర్‌పల్లి: పట్టణ చౌరస్తా నుంచి ఫత్తేపూర్ వరకు నిలిచిన నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గుంతల రోడ్డుపై బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల, వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఎన్నో ఏళ్లుగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా, మధ్యలోనే వదిలేశారని, వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేకపోతే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ధర్నాలో ఫౌండేషన్ కార్యదర్శి వేనేంద్రచారి, సభ్యులు మహేదర్ రెడ్డి, రాజు, రవి, గంగాధర్, బస్వరాజ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



చెంచుకాలనీలోని లబ్ధిదారుల నివాసప్రాంతాల్లో వివరాలు సేకరిస్తున్న అధికారులు, నాయకులు

కుల్కచర్ల: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి 43ఇళ్లు మంజూరు కావడంతో హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్రం అందించే నిధులతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వెనుకబాటుకు గురవుతున్న చెంచుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, హౌసింగ్ ఏఈ హర్షవర్ధన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి జహంగీర్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, జోగు వెంకటయ్య, పడమటి అంజిలయ్య, గోవర్దన్ రెడ్డి, బాల్‌రెడ్డి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జాతీయ బీసీ సేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని జాతీయ బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లిలో జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో బీసీసేన మహిళా విభాగం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ మహిళలకు పూర్తిస్థాయి స్వేచ్ఛ రాలేదని ఆరోపించారు. మహిళలకు ప్రోత్సాహం లేకపోవడంతో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమస్యలపై మహిళలందరూ చైతన్యవంతులు కావాలని, గ్రామ గ్రామాన మహిళా సమాజాన్ని ముందుకు నడిపించాలన్నారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా జాతీయ బీసీసేన అండగా ఉంటుందన్నారు. అనంతరం జాతీయ బీసీసేన ఎల్లంపల్లి మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా కందివనం లలిత, ఉపాధ్యక్షురాలిగా గూడెం సుగుణమ్మ, ప్రధాన కార్యదర్శిగా బోడంపాటి మాధవి, కార్యదర్శిగా గున్న లక్ష్మమ్మ, సహాయ కార్యదర్శిగా న్యాస నీలవేణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీసేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్, మండల మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు స్రవంతిరాజ్, కార్యదర్శి గుల్లె సరస్వతి, నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



నూతన సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బీసీ సేన నాయకులు

విద్యాభివృద్ధిపై శ్రద్ధ వహించాలి



కుల్కచర్ల: ఉపాధ్యాయుల ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ రాంచందర్



తాండూరు రూరల్: రిసోర్స్‌పర్సన్‌లను సన్మానిస్తున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

కుల్కచర్ల: ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి శ్రద్ధ వహించాలని చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్ అన్నారు. శనివారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఉపాధ్యాయుల 5రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు అత్యుత్తమ బోధన చేపట్టాలన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ ముగియడంతో ఎంఈఓ అబీబ్ అహ్మద్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

తాండూరు రూరల్: ఉపాధ్యాయులే మార్గదర్శకులు అని ఎంఈఓ నర్సింగ్‌రావు అన్నారు. పెద్దేముల్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు తరగతి గదుల్లో పాఠాలు బోధించడేమ కాకుండా గౌరవం, సహనం, సానుభూతి వంటి నైతిక విషయాలు నేర్పించాలన్నారు. సమాజంలో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు బందెప్ప, నర్సిరెడ్డి, విజయ, నర్సిములు, శోభన్ బాబు, నర్సిములు, రెహమత్, రమేష్, రాఘవేందర్‌లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్పులకనుగుణంగా బోధన

కొడంగల్ రూరల్: సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యాబోధన చేపట్టాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సరళమైన పద్ధతిలో అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

దోమ: విద్యార్థుల చదువుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ గ్యామా తెలిపారు. శనివారం దోమ కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ చివరి రోజు కావడంతో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి

విద్యార్థుల సంఖ్య పెంచాలి

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈఓ మల్లేశం ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేపట్టాలన్నారు.



దోమ: మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా